# గుప్పెడు మనసు

పసిడిపూత పూసినట్లున్న చర్మం... నేర్పరియైనశిల్పి తీర్చిదిద్దినట్టున్న చక్కని అవయవాల పొందిక... ముట్టుకుంటే మాసిపోయేట్టు, పట్టుకుంటే కందిపోయేట్టున్న శరీర లావణ్యం... అమాయకత్వం ఉట్టిపడే చంద్రబింబంలాంటి గుండ్రటి ముఖం - మెరుపుతీగలా... సౌందర్యాన్నంతా ఒక్క చోట కుప్పబోసినట్టుగా... దివి నుంచి భువికి దిగివచ్చిన దేవకన్యలా వుందా అమ్మాయి. సాయంత్రం అలా తిరిగొద్దామని బయటకెళ్ళిన డాక్టర్ నరేశ్ ఆ సౌందర్యరాశిని ఆ అడవిలో చూసి నోరెళ్ళ బెట్టాడు... చుట్టూ గిరిజన గూడాలుండే ఆ మారుమూల పల్లెలో అంతటి అందమయిన అమ్మాయి ఉండటం అతని కాశ్చర్యంగానే ఉంది. సౌందర్య రసాధి దేవత 'వీనస్'ను మించిన అందగత్తె. ఆమె అందం అతని మతి పోగొడుతోంది. ఆమెను మొదటి సారి చూస్తూనే ప్రపంచ అందగత్తెల పోటీలో పాల్గొంటే మొదటి బహుమతి ఆమెకే వస్తుందనుకున్నాడు.

ఆమె నడుస్తుంది... ఆ నడక నరేష్‌కు నాట్యంలా అనిపిస్తుంది. చెట్లపై వున్న పక్షులతోమాట్లాడుతుందామె... ఆ మాటలతనికి ముత్యాలు రాలినట్టనిపిస్తున్నాయి. ఆమె అటూ ఇటూ పరుగిడుతుంది. ఆ పరుగు సెలయేరుపారినట్టనిపిస్తుందతనికి. అడవిలో పుల్లలేరుకుంటున్న ఆ అమ్మాయిని నరేష్ చాలా సేపట్నుండి చూస్తూ కొత్త భావావేశానికి లోనవుతున్నాడు. తన పనిలో మునిగిపోతున్న ఆమె మాత్రం అతన్ని గమనించడం లేదు...

కొద్ది సేపట్లా తిరిగిందామె... తనకు కొంతదూరంలో వుండి తననేగమనిస్తున్న నరేష్‌ను చూసింది.. అయినా ఆమె బెదిరిపోలేదు. అక్కణ్నుంచి పరుగెత్తనూ లేదు... కృత్రిమమైన సిగ్గునభినయించనూలేదు... కొద్ది క్షణాలతన్ని చూసి తన పనిలో నిమగ్నం కాబోయింది. రెండు అడుగులేసి ఆమెను సమీపించాడు నరేష్... అతడు దగ్గరకు రావడం చూసి ఆ అమ్మాయి నిల్చుంది.

''నీ పేరు..?'' అడిగాడు నరేష్...

''రాజీ'' కోకిల పలికినట్టుందా జవాబు

''మీ రెవరు?''

''లంబాడీలం...''

''మీదీవూరేనా...?''

''అవును...''

అడిగిందానికి ముక్తసరిగా జవాబులు చెబుతోంది రాజి. అయినా ఆమెలో విసుగే కనిపించక పోయేసరికి మరికొంతసేపు మాట్లాడాలనుకున్నాడు నరేష్..

''ఏంటీ! నీలో నువ్వే మాట్లాడుకుంటున్నావు...? పరుగెత్తుతున్నావు...? గెంతుతున్నావు...''? నవ్వుతూ అన్నాడు నరేష్..

ఏం జవాబివ్వకుండా నవ్వింది...

ఆ నవ్వులో సెలయేటి గలగలలు వినిపించాయి నరేష్‌కు... కొద్దిసేపాగి నరేష్.

''ఒంటరిగా అడవి కొచ్చావు? భయం వెయ్యదా...?'' అన్నాడు...

''భయమా...? ఎందుకు...?'' అతిమామూలుగా అని

''మరి నీకు భయమెయ్యదా?'' అంది...

ఆమెకేం సమాధాం చెప్పాలో తోచలేదు నరేష్‌కు...

''నేను మగవాణ్ని కదా...!'' అన్నాడు నరేష్.

''ఆడవాళ్లైతే భయపడాలా....? నాకేం భయం లేదు... మేం రోజూ అడవికొస్తూనేవుంటాం...'' అందిరాజి

''నిన్ను నేనేమైనా చేస్తే...?'' అన్నాడామెను రెచ్చగొడుతూ...

''ఏం చేస్తావు...''

ఆమె అమాయకత్వాన్ని చూసి నవ్వాడు నరేష్...

కొద్ది క్షణాలాగి మళ్లీరాజి

''మీరు సూది మందిచ్చే డాక్టర్‌గదా...?'' అంది మీరిది వరకే నాకు తెలుసులే అన్నట్టు...

అవునని తలూపాడు నరేష్...

''నాకు సూది మందంటే భయం...'' అంది రాజి

''అలాగా! నేను సూది మందొక్కటేకాదు... గోళీలు, టానిక్‌లు.. అన్ని మందులిస్తాను...'' అన్నాడు నవ్వుతూ నరేష్...

''మా కూడా గోళీలు, మందులిస్తారా...''? అందిరాజి

''ఎందుకివ్వను...? నేనున్నదే అందుకోసం ...''

''పొద్దు గూట్లో పడుతుంది... నేను పోతా...'' అని ఏరిన పుల్లల్ని మోపుగా కట్టుకొని నెత్తిలపై కెత్తుకుని గబగబా అక్కణ్నుంచి వెళ్ళి పోయింది...

అలా పరిచయమేర్పడింది రాజితో నరేష్‌కు. ఆ మారుమూల గ్రామ ప్రైమరీహెల్త్‌సెంటర్‌లో పోస్టింగ్ వచ్చినప్పట్నుంచి విలవిల లాడుతున్నడు నరేష్... ఇప్పుడు రాజితో అయిన పరిచయం అతనికి ఎడారిలో ప్రయాణిస్తున్నవాడికి ఒయాసిస్సులా అనిపించింది. మండుటెండల్లో ప్రయాణిస్తున్నవాడికి చల్లని నీరు లభించినట్టనిపించింది. ఆమెతో పరిచయమైన తర్వాత ఆ ఊర్నుంచి బదిలీ చేయించుకోవాలనుకున్న ఆలోచనను విరమించు కున్నాడు నరేష్... ఆ అడవిలోనరేష్ బతుకువీణలోమధురాగాన్ని మోగించిందామె...

''సారూ! ఈయన మా మామ...! కట్టెలు కొడుతుంటే కాలుకు గొడ్డలి తాకింది... రక్తం

విపరీతంగా కారింది. పసరు రాసాము...'' అంటూ ఓ రోజు రాజి మేనమామను తీసుకొచ్చి మందు తీసుకెళ్ళింది...

''వీడు మా తమ్ముడు...! కాలుకు కంప కొట్టింది...'' అని మరోసారి సవితి తమ్ముణ్ణి తీసుకొచ్చి మందు తీసుకెళ్లింది.... ''ఇది మా చిన్నమ్మ...! జ్వరమొచ్చింది... పడిశం పట్టింది...'' అని ఇంకోసారి చిన్నమ్మకు మందు పట్టుకెళ్ళింది... ''నాకు నిన్నట్నుంచి జ్వరమొస్తుంది సారు...'' అని ఆమె కూడా మందు తీసుకెళ్ళేది...

ప్రమాదాలతో కూడుకొన్నున్న పనులుచేసే తనవాళ్ళను హాస్పిటల్‌కు తీసుకొచ్చి మందులు తీసుకునేదిరాజి. తనవాళ్ళ గురించి తమ బతుకుల గురంచి ఎన్నో విషయాలు చెప్పేది...

అలా వాళ్ళ మధ్య పరిచయం మరింత పెరిగింది... ఆమె చెప్పే మాటలు శ్రద్ధగా వినేవాడు నరేష్... ఆమె తీసుకొచ్చిన మనిషిని మరింత శ్రద్ధగా చూసేవాడు... అందుబాట్లో ఉన్నదాంట్లోంచి మంచి మందులిచ్చేవాడు...

''తునికిపండ్లు సారు... తియ్యగుంటయి...''

''అల్లనేరేడపండ్లు సారు.. కమ్మ గుంటయి...'' అని అడవిలో దొరికే పండ్లు తెచ్చి డాక్టర్‌కిచ్చేది... తినండని బలవంతం చేసేది...

గలగలామాట్లాడుతూ అడవితల్లి బిడ్డలుగా బతికే తమ బతుకుల్లోని విషాదాన్ని గూర్చి చెప్పేది రాజి.

''ఇవన్నీ ఎందుకు తెస్తున్నావు...?'' గంగరేగి పళ్ళు తెచ్చిచ్చిన రాజితో అన్నాడు నరేష్...

''మీరెంత మంచివాళ్ళు సార్...? ఇదువరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్లెవ్వరూ మా వాళ్ళ నింత మంచిగా చూడలేదు... మమ్ములను చూస్తేనే కసురుకునేవారు.. మందులివ్వడానికి విసుక్కునేవారు...'' అంది రాజి.

''ఇందులో ఏముంది...? ఇది మా డ్యూటీయేనా...'' అన్నాడు నరేష్...

ఆమె తీసుకొచ్చిన వాళ్ళనంత శ్రద్ధగా చూడటం ఆమె మెప్పు పొందడానికే నన్న విషయం రాజికి తెలియదు... డాక్టర్ నరేష్ మనసులో మరో ఉద్దేశముందన్న సంగతి ఆ అమాయకురాలికసలే తెలియదు...

రాజితో మాట్లాడు తుంటే నరేష్‌కు సమయమే తెలియదు.. ఆమె కనబడితేనే అతని ముఖం వికసించేది... వాళ్ళ వాళ్ళను బాగు చేస్తానన్న సాకుతోనో, ఆమెకే మందిస్తానన్న నెపంతోనో హాస్పిటల్‌కు రప్పించుకునేవాడు.. లేదా ఆమె అడవికి పోయిందని తెలుసుకొని అడవికెళ్ళేవాడు... క్రమక్రమంగా ఆమెతో మాట్లాడందే, కనీసం చూడందే రోజు గడవని పరిస్థితొచ్చిందతనికి.. ఆమెను చూడని రోజు ఏదో వెలితిగా ఉన్నట్టు భావించేవాడు...

ఏ స్త్రీలోనూ ఇంతటి ఆకర్షణను చూడలేదు నరేష్... చదువుకునే రోజుల్లో సీతాకోక చిలుకల్లాంటి ఎంతో మంది నాగరిక స్త్రీలను చూసినా అతనిపై ఇంత ప్రభావాన్ని చూపిన స్త్రీ లేదు.. ఓ లంబాడీ స్త్రీ అతనిపై ఇంత ప్రభావాన్ని చూపడం నరేష్‌కే వింతగా అనిపిస్తుంది...

ఆమెతో పరిచయమైనప్పట్నుంచి నరేష్‌లో సంఘర్షణ మొదలైంది. ఆ సంఘర్షణక్రమక్రమంగా బలపడసాగింది. 'రాజిని తనదాన్ని చేసుకుంటే...? ఇది సాధ్యమా...? రాజి లేకుండా తాను బతకగలడా...?

రాజిని భార్యగా చేసుకోవడంలో అడ్డంకులేంటి...? అవి అధిగమించడం సాధ్యం కాదా...?'' నరేష్‌లో రకరకాల ప్రశ్నలు...

ఏదేమైనా రాజిని సొంతం చేసుకోవాలన్న ఆలోచనే నరేష్‌లో రోజురోజుకూ బలపడుతోంది.

'తనకు రాజికావాలి.. రాజి తన సొంతంకావాలి... తనకు నాలుగు లక్షల కట్నమిచ్చి అమ్మాయినివ్వడానికి చాలామంది సిద్ధంగా వున్నారు... కాని, ఎన్ని లక్షలు ఎదిరిచ్చినా ఇంతటి ముగ్ధమోహన సౌందర్యరాశి భార్యగా లభిస్తుందా...? ఎంత డబ్బు ఖర్చు పెట్టినా పాల మీగడలాంటి స్వచ్ఛమైన ఇలాంటి అమ్మాయి దొరుకుతుందా? లంబాడీ స్త్రీయైనా రాజి అందం ముందు ఏ నాగరిక స్త్రీ అందమైనా దిగదుడుపే... రాజిముందు వాళ్ళంతా కాగితం పూలే అనిపిస్తుంది తనకు... ఆమెకు చీరగట్టి సింగారిస్తే ఎంత చదువుకున్న స్త్రీయైనా ఆమె ముందు సూర్యుడి ముందు దివిటీలాగే వుంటుంది... ఆమె లేందే తాను బతుకలేడు... ఆమె కోసం తాను కట్టుబాట్ల నధిగమించడానికైనా సిద్ధమే... ఎన్ని అవరోధాలెదురైనా ఎదుర్కోవడానికి సిద్ధమే...! తనకు రాజి కావాలి... రాజి కావాలి...'

రాజిని తన భార్యగా చేసుకోవడానికే నిర్ణయించుకున్నాడు నరేష్... అలా చేసుకోవడానికి దృఢనిర్ణయం తీసుకున్న తర్వాత నరేష్ హృదయం తేలికైంది. ఇపుడతని మనసు గాలిలో తేలిపోతుంది.. ఆమెతో తన జీవితాన్నూహించు కుంటూ కలలు కంటున్నాడు నరేష్... రాజీతో తన మనసులోని మాట చెప్పాలని నిర్ణయించుకున్నాడు... సమయం కోసం ఎదురుచూస్తున్నాడు... ఆ రోజు సాయంత్రం రాజిని హాస్పిటల్‌కు రమ్మని కబురుచేశాడు. ఆమెతో మాట్లాడే మాటలను రిహార్సల్ చేసుకుంటూ ఆమె కోసం చూస్తున్నాడు.

ఒంటరిగా వస్తుందనుకున్న 'రాజి' పక్కన లంబాడి యువకుణ్ని చూసిననరేష్ నొసలు ముడిపడింది... అతనిలో కొద్ది క్షణాల క్రితం ఉన్న ఉత్సాహం సగం మాయమైంది... ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ లేడికూనలా పరుగెడుతూ వుండే రాజీ ముఖంలో విచారాన్ని చూసి నరేష్ ఆశ్చర్యపోయాడు.. సర్వం కోల్పోయిందానిలా, విరాగినిలా వున్న రాజీ అతనికి ప్రశ్నార్థకంగా కనబడుతోంది. డాక్టర్‌కు కొంచెం దూరంలో నిల్చుంది రాజీ... ఆమె పక్కనున్న యువకుడు ఆయాసంతో రొప్పుతున్నాడు. ''సారూ! ఈయన మా బావ...' పేరు మంగీత్యా! మా అన్నయ్యలు మా బావతో నా మనువు ఖాయం జేసిండ్రు.. నేనువద్దన్నా వినకుండా మా మనువుకోసం పైసలు సంపాదించుకొస్తానని ఆరు నెలల కింద ఊరిడిసి వెళ్ళిపోయాడు.. ఇన్ని రోజులుకరీంనగర్‌లో రిక్షా తొక్కుకుంటూన్నడు.. రాత్రి పగలుతిండితిప్పలన్ని మరిచి డబ్బు సంపాయించన్ననిరిక్షా తొక్కిండు.. ఆరోగ్యం పూర్తిగా పాడైంది... రోగమని తెల్సింది... మీరు మంచి డ్వాక్టరని తీసుకొచ్చిన... ఎన్నిపైసలైన మంచిదే.. కష్టపడి తెచ్చిస్తా... మీరే మా బావను మంచిగ జెయ్యాలె... మా బావ ఆరోగ్యం మంచిగైంతర్వాత మా మనువైతది...'' అని పరిపరి విధాలుగా నరేష్‌ను బతిమిలాడుతుంది రాజి...

నరేష్‌కు రాజి బతిమిలాడుతూ అంటున్న మాటలేవీ వినబడటం లేదు... 'మంగీతాయ్య మా బావ... అతని ఆరోగ్యం బాగైతే మా మనువైతది' అన్నరెండే రెండువాక్యాలు అతనిచెవుల్లో గింగురు మంటున్నాయి.

ఆ మాటలాతనికి షాక్‌లా వున్నాయి.... అతని కలలు భస్మమై పోతున్నట్టనిపిస్తుందతనికి... ఆకాశం నుండి అధఃపాతాళానికి విసిరి వేస్తున్నట్టుంది. అతనిముఖంలో రంగులు మారుతున్నాయి...

వాళ్ళిద్దర్నీ అలాగే చూస్తూ కూర్చున్నాడు నరేష్...

''సారూ'' మీరేదో ఆలోచిస్తున్నట్టున్నారు... నేనింతవరకు చెప్పింది వినబడిందా మీకు.. ? మా బావకు మందియ్యాలి మీరు...'' అంది రాజీ..

''ఎందుకు వినబడలేదు...? మందియ్యాలి... ఏం మందియ్యాలి...? మందెందుకు...?'' తడబడుతూ అన్నాడు నరేష్.

''సారు! మీ మనసు బాగాలేనట్లుంది...'' అంది రాజి...

''అవును! నా మనసు బాగాలేదు...'' అని మంగిత్యా పాత రిపోర్టు చూశాడు నరేష్... నాడీ చూశాడు... స్టెతస్కోపుతో పరీక్షించాడు.. మందు లిమ్మని కాంపౌడర్‌కు చెప్పాడు...

''మందులు వాడి రెండ్రోజుల తర్వాత మళ్ళీ రా... అన్ని పరీక్షలుచేస్తాను...'' అనిమంగీత్యాతో చెప్పి వెళ్ళిపొమ్మన్నాడు.. మందులు తీసుకొని రాజీ మంగీత్యాతో వెళ్ళిపోయింది... కాంపౌండర్‌ను చూసుకొమ్మని చెప్పి ఇంటికొచ్చాడు నరేష్...

కుర్చీలో కూర్చొని తలపట్టుకున్నాడు.

అతని మనసులో రకరకాల ఆలోచనలు... ''తనకు రాజి కావాలి.. రాజి ఎప్పుడూ తనకు బావున్నట్లు చెప్పలేదే...? ఏదేమైనా రాజి తనకు కావాలి. కాని, తను మధ్య సైంధవుడిలా ''మంగిత్యా''... తనకిప్పుడు రాజీ ఎలా దక్కుతుంది...? మంగీత్యాకొచ్చిన వ్యాధి తీవ్రస్థాయిలోనే ఉంది.... అయినా ఆ వ్యాధిని తాను నయం చేయగలడు... కాని, మంగిత్యా వ్యాధి నయమైతే రాజీ తనకు దక్కదు... మరా అడ్డులేకుండా చేసుకుంటే...??''

నరేష్‌లో ప్రశ్నలు.... ప్రశ్నలు...

'తనను నమ్మి రాజీ మంగీత్యానుతనచేతిలో పెడుతుంది... ఆమెకు నమ్మక ద్రోహం చేస్తే...? చేయాలి... తప్పదు... తనకు రాజీ కావాలంటే మంగీత్యా ఉండకూడదు. అంతే... అంతే... కాని... కాని...' మంచి చెడుల మధ్య ఘర్షణ చెలరేగుతోంది నరేష్‌లో... 'డాక్టర్‌గా తానిలా చేయడం భావ్యమా...? అది తన వృత్తికే కళంకం కాదా...?'

నరేష్‌లో రాక్షసుడు ప్రవేశిస్తున్నాడు... అంతరాత్మ గొంతు బలంగా నొక్కుతున్నాడు...

బెర్నార్డ్ షా ప్రసిద్ధ నాటకం డాక్టర్స్ డైలమా...లోని డాక్టర్ పాత్ర జ్ఞాపకమొచ్చింది నరేష్‌కు... ఆర్టిస్టు భార్యపై వ్యామోహంతో తన దగ్గరకు ట్రీట్‌మెంటు కొచ్చిన కళాకారుణ్ణి బతికించే అవకాశముండీ బతికించడు డాక్టర్...

'ఆ డాక్టర్‌కు ఆమె దక్కలేదు... కాని తనకు రాజి తప్పకుండా దక్కుతుంది... 'మంగీత్యా' లేకపోయింతర్వాత రాజి తనకెందుకు దక్కదు...? ఆమెకున్న అభ్యంతరాలేంటి...? ఎంత అందగత్తె అయితే మాత్రం గిరిజన స్త్రీకి తనలాంటి భర్త దొరుకుతాడా...? మంగీత్యా లేకుంటే రాజి తనదౌతుంది... తప్పకుండా తనదౌతుంది...'

దృఢ నిర్ణయం చేసుకొని లేచాడు నరేష్...

తనను నమ్మి ప్రాణం బాధ్యతను చేతిలో పెట్టిన అమాయకులకు నమ్మక ద్రోహం చేశాడు... తన మెడికల్ విజ్ఞానాన్నంతా ఉపయోగించి ఎవరికీ అనుమానం రాకుండా 'మంగీత్యా' కిచ్చే మందులో స్లోపాయిజన్ కలిపిచ్చాడు... మంగీత్యా మరణించిన రోజు రాజికంటికో కడివెడుగా దుఃఖించింది. అంత

దుఃఖంలోనూ ఆమె నరేష్‌ను గమనించింది... వేటగాడి వేటుకు నేలకూలిన పక్షిని చూసి ఆ వేటగాడు పొందిన ఆనందాన్ని నరేష్ ముఖంలో గమనించింది రాజి.

కొద్ది రోజుల గడిచాయి... 'రాజికి మంగీత్యా చావు అశనిపాతం లాంటిదే... అయినప్పటికీ ఎంత ఆత్మీయులు మరణించినాకాలగమనంలో ఆ దుఃఖం నుంచి దూరం కావడం జరుగుతూనే వుంటుంది. మరుపనేది కాలం మనిషికి ప్రసాదించిన వరం... మరిచిపోవడమనేదే లేకుంటే దు:ఖం మనిషిని శాశ్వతంగా అంటిపెట్టుకొనుండేది... రాజీ మంగీత్యాచావువల్లకలిగినశోకాన్ని మరిచిపోతూ మామూలు మనిషవడానికి ప్రయత్నిస్తోంది.

ఈలోగా డాక్టర్‌నరేష్ రాజీతో తన సాంసారిక జీవితాన్ని తలుచుకుంటూ పరవశం చెందుతున్నాడు... ఆమెతో పొందుగూర్చి స్వప్నాలు కంటూ మానసిక వ్యభిచారాన్ని కొనసాగిస్తున్నాడు...

రాజి ఇప్పుడు తనను పెళ్లి చేసుకోవడానికి ఆమెకే అభ్యంతరం వున్నట్టు నరేష్‌కు తోచడంలేదు.. ఇది వరకు తన మేనబావ 'మంగీత్యా' మీది ప్రేమతోకాదనేదేమో...? కాని ఇప్పుడా అదేం లేదు...

'తను డాక్టర్... డబ్బున్నవాడు... తనను చేసుకుంటే ఆమె అన్ని విధాలా సుఖపడుతుంది... 'మంగీత్యా'ను తన దగ్గరకు తీసుకురాకముందే తానామెనడగాల్సింది... తనే ఆలస్యంచేశాడు. ఆమె తప్పకుండా ఒప్పుకొనుండేది... అయినా ఇప్పుడు మాత్రమేమైంది...? ఆమె తప్పకుండా అంగీకరిస్తుంది....'

తనకు తాను రకరకాలుగా నచ్చజెప్పుకుంటూన్నాడు నరేష్... 'తనకేం తక్కువని ఆమె ఒప్పుకోదు...? చదువు, అందం, ఉద్యోగం, ఇల్లు, కార్లు, సంపద... అన్నీ వున్నాయి... అడవిలో పుట్టి, అడవిలో పెరిగి, అడవి తల్లిబిడ్డగా బతుకుతున్న రాజి తననెందుకు కాదంటుంది...? తనను చేసుకోవడం అదృష్టంగా భావిస్తుంది... మహద్భాగ్యంగా స్వీకరిస్తుంది... తన మాట వినగానే ఎగిరి గంతేస్తుంది... తనను తప్పకుండా పెళ్ళాడుతుంది...'

రాజీతో తన అభిప్రాయాన్ని చెప్పడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నాడు నరేష్... ఆమెతో మాట్లాడాల్సిన మాటల గూర్చి మననం చేసుకుంటున్నాడు... ఓ రోజు అతడెదురు చూస్తున్న అవకాశం రానే వచ్చింది...

రాజీ నరేష్‌కు ఒంటరిగా కనిపించింది.. ఆమె కడిగిన ముత్యంలా వుంది.. ముఖం మీద విచారపు జీర కనబడుతున్నా ఆమె మరింత అందంగా కనబడుతుంది...

రాజిని సమీపించాడు నరేష్...

''బాగున్నావా రాజీ...'' అన్నాడు...

''ఊ..'' అంది ముభావంగా రాజి...

''రాజీ! చాలా రోజుల్నుంచి నేను నీతో ఓ మాట చెప్పాలనుకుంటున్నాను. కానీ ఎన్నో సంకోచాలు... నేను...''

''మీరేం చెప్పుతారో నాకు తెలుసు... అయినా మిమ్మల్నేం చూసి నేను మనువాడాలి...? నరేష్ పూర్తిగా చెప్పకముందే మధ్యలో అందుకొని అంది రాజి...

ఆ మాటల కవాక్కయ్యాడు నరేష్...

కొద్ది క్షణాలాగి, ''నేను నిన్ను మనసారా కోరుకుంటున్నాను... నాతో జీవితం పంచుకుంటే నువ్వీ అడవి బతుక్కు దూరం కావచ్చు... సుఖపడవచ్చు...''

నరేష్‌ను వో పురుగును చూసినట్టు చూసింది రాజీ.. ''నామీద మీకు మనసుందా...? నా మీదంటే...? నా శరీరం మీదేకదా! అంటే నా ఈ తోలుమీద... నేను ఎర్రగా బుర్రగా లేకుంటేమీరీ మాటలనేవారా...? అనరు... అసలే అనరు.. మిమ్మల్ని చేసుకుంటేనేను సుఖపడతానా...? సుఖమంటే ఏంటిసారు...? కార్లల్లో తిరగడం, మేడలు మిద్దెల్లో వుండటం, బాగా తినడం ఇదేనా సార్‌సుఖమంటే...? అటువంటి సుఖం నాకేమొద్దు... సుఖపడటానికి మనుసు పడటానికి పెద్ద పెద్ద చదువులు, బాగా పైసలేమక్కర్లేదు.. గుప్పెడు మనసుంటే చాలు సారు... అది నాకుంది... మా బావకుంది.. మీకెక్కడుందిసార్...? మీరు మా బావ కంటే ఎందులో గొప్ప...? మా బావ బతికున్నప్పుడే మీకు నామీద మనసుందని చెప్పాను.. అప్పుడుమా బావేమన్నాడో తెలుసా...? నాసుఖం కోరి నిన్నే చేసుకొమ్మన్నాడు... నేనే కాదన్నాను... కాని, మీరేంచేశారు...? మీ సుఖం కోసం మా బావనే లేకుండా చేశారు... నేనిది నిరూపించలేనేమో... కాని మీరేంచేశారో మీకు తెలుసు... మీలాంటి నీచున్ని పెళ్ళి చేసుకోవడం కంటే ఏ కూలో నాలో చేసుకునే వాణ్ణి చేసుకుంటే ఎక్కువ సుఖపడుతాను... మీకార్లతో వచ్చే సుఖం నాకేమొద్దు... మీరు మా బావను చంపకున్నా మిమ్మల్ని చేసుకునేదాన్ని కాదు...'' నరేష్‌ను అసహ్యంగా చూసి అతని జవాబుకోసం కూడా ఎదురుచూడకుండా గబగబా వెళ్ళిపోయింది రాజి...

ఏవైతే తాను గొప్ప విలువలని, సుఖాలని భావించాడో వాటిని గడ్డిపోచల కంటే హీనంగా భావించి వెళ్ళిపోయిన రాజి మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే అలాగే స్థాణువై నిలుచుండిపోయాడు డా॥నరేష్.. అతని కాళ్ళు భూమిలో పాతుకుపోయినట్టే ఎంత ప్రయత్నించినా కదలడం లేదు...

*ఈనాడు ఆదివారం 31-10-93*